క్లుప్తంగా

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లతో పాటు చర్లకు వచ్చే అన్నీ ప్రధాన రహదారులలో తనిఖీలను నిర్వహించి పోలీసులు సంతకు వచ్చే వారిని నిశితంగా తనిఖీ చేశారు. చర్ల సీఐ బి.రాజగోపాల్ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను నిర్వహించారు. ఈ సంతకు సరిహద్దు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సారపాకకు సమీపంలో గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

దమ్మపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో గల స్థానిక సమస్యలు, జరిగిన అభివృద్ధిపై అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో చర్చ జరుగుతుందని, సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

గౌడ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

అశ్వాపురం: గౌడ కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు అండెం గంగరాజు అన్నారు. ఆదివారం మొండికుంటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడలకు, గౌడ సహకార సంఘాలకు రైతుబీమా తరహాలో గౌడ బీమా చేస్తామని అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చి గౌడులకు నుండి ఆధార్‌కార్డు, ఐడీకార్డు జిరాక్స్‌లు తీసుకొని అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం నెల్లిపాక గ్రామ అధ్యక్షుడు పాడిశెట్టి రాములు, గౌడ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ

అశ్వాపురం: తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల మణుగూరు డివిజన్ నూతన కమిటీకి ఆదివారం మణుగూరులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవిందు(ఎఫ్ఎస్ఓ), ఉపాధ్యక్షుడిగా ఎర్రయ్య(ఎఫ్‌బీఓ), ప్రధాన కార్యదర్శిగా శ్యామ్(ఎఫ్‌బీఓ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అరుణ(డీఆర్ఓ), సంయుక్త కార్యదర్శిగా బాబురావు(ఎఫ్‌బీఓ), కోశాధికారిగా బీబీసీ నాయక్ ఎన్నికయ్యారు.

మొబైల్ మెకానిక్ అసోసియేషన్..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ మొబైల్ మెకానిక్ అసోసియేషన్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. సీపీఎం పార్టీ స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యర్రంశెట్టి పరుశురామ్, సెక్రెటరీ తుపాకుల మహేష్, కోశాధికారిగా బీరక గణేష్, గౌరవాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డితో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు, సురేష్, జాకీర్, దుర్గాప్రసాద్, హర్షారెడ్డి, సాయి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నాటికోత్సవాలు వైభవంగా ప్రారభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి నాటకోత్సవాలను ప్రారంభించారు. మూడు రోజులు జరిగే నాటకోత్సవాల్లో భాగంగా మొదటి రోజు చైతన్య భారతి కరీంనగర్ ఆధ్వర్యంలో 'స్వప్న రాల్సిన అమృతం' నాటికను నిర్వహించారు. అనంతరం అతిథులను సన్మానించారు.

సమస్యలకు దగ్గరగా..

మారని అడవి బిడ్డల బతుకులు

- ఏజెన్సీ గ్రామప్రజల కష్టాలు కోకొల్లలు..
- మౌలిక వసతులకు దూరంగా ఆదివాసీ గ్రామాలు
- సరైన రోడ్డు, వైద్యానికి నోచుకోని వైనం



కిష్టారంపాడు గ్రామానికి వెళ్లే దారి



గ్రామాలకు వెళ్లే దారి

చర్ల రూరల్: ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న అడవి బిడ్డల బతుకులు మారడం లేదు. అడవినే నమ్ముకుని నిత్యం ప్రమాదాల మాటున నివసించే అమాయక గిరిజనులను పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నేటికీ కనీస సదుపాయాలు లేక సతమతమవుతున్న గిరిజన గ్రామాలు చర్ల మండలంలో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ సరైన రోడ్డు మార్గం లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో తరాలుగా బాహ్య ప్రపంచానికి దూరంగా గిరిజన ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగిస్తుస్తున్నారు.

గర్భిణుల కష్టాలు వర్ణణాతీతం

అడవి తల్లిని నమ్ముకుని జీవించే చర్ల ఏజన్సీ గ్రామాల ప్రజల కష్టాలు కోకొల్లలు. మండలంలోని ఎర్రంపాడు, రాళ్లపురం, కిష్టారంపాడు, బూరుగుపాడు, కొర్కట్ పాడులాంటి గ్రామాలు వర్షాకాలం వచ్చిందంటే వాగులు, వంకలు పొంగిపొర్లుతాయి. దీంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. ఆయా గ్రామాల్లో నివసించే గిరిజనుల ఏదైనా ప్రమాదం జరిగితే వైద్యం అందక మృత్యువాత పడిన ఘటనలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా గర్భిణుల కష్టాలు చెప్పలేనివి. గ్రామాల చుట్టూ వరద నీరు చేరడంతో అత్యవసర వాహనాలు కూడా గ్రామాల దరికి చేరని దుస్థితి. అనేక సార్లు గ్రామస్తులు ఏకమై గర్భిణులను జడ్డీల ద్వారా ఆసుపత్రికి మోసుకొచ్చిన ఘటనలు లేకపోలేదు. ఒక్కోసారి మార్గం మధ్యలోనే ప్రసవం అయిన సంఘటనలు వైద్యం అందక మృత్యువాత పడిన ఘటనలున్నాయి. చుట్టూ అడవి పొంగి పొర్లే వాగులు పగటి వేళల్లో కొంచెం మార్గాలు కనిపిస్తాయి. ఏజన్సీ ప్రాంతాలలో నివసించే కొన్ని గిరిజనుల గ్రామాల్లోకి నేటికీ అత్యవసర వాహనాలు కూడా వెళ్లేందుకు సరైన రహదారులు లేకపోవడం బాధాకరం. ఎన్నికల సమయంలోనే తమ గ్రామాలకు వచ్చే నాయకులు, పాలకులు తమ గ్రామాల అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని ఏజన్సీ ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులను మోసుకుపోవాల్సిందే..



మా గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక నానా అవస్థలు పడుతున్నాం. ఎన్నో తరాలుగా ఇదే గ్రామంలోనే ఉంటున్నాం. అత్యవసర సమయాలలో ఇక్కడి నుండి గర్భిణులను చర్ల ఆస్పత్రికి తీసుకుపోవాలంటే కర్రల సాయంతో జడ్డీలతో మూడు కిలో మీటర్ల వరకు మోసుకుని అక్కడి నుండి ఆటోల తో చర్ల ఆస్పత్రికి చేరుకుంటాం. ఆటోలు సమయానికి లేకపోతే చర్ల వరకు మోసుకుని పోవాల్సిందే.

– ముస్కి బాలు, రాళ్లపురం

రహదారి నిర్మించాలి



మా గ్రామానికి సరైన రహదారి నిర్మించాలి. రహదారి లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఆస్పత్రికి పోవాలన్నా నడిచే వెళ్లాల్సిన పరిస్థితి. ఎన్నికలప్పుడు మాత్రం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పేవారే... సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ఇప్పటికైనా మా గ్రామానికి రహదారి నిర్మిస్తే జడ్డీలను మోసే అవసరం ఉండదు.

– లక్ష్మి, రాళ్లపురం

జీపీ భవనాల నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీఓ

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: మండలంలోని పలు నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు అధికారుల అలసత్వంతో జాప్యం జరుగుతోందని వివరిస్తూ 'గ్రామ పాలనపై నిర్లక్షపు నీడ' అని సాక్షిలో కథనం శుక్రవారం ప్రచురించగా అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం మండల ఎంపీఓ కుమార్ తాటిగూడెం, అనంతారం పంచాయతీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలోనే పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని ఇప్పటికే పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనన్నారు. మొదలుపెట్టిన పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేస్తూనే మిగతా మంజూరైన జీపీల్లో పనులు ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకోం..

కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే ఊరుకునేది లేదని పార్టీ మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండునెలలు గడవకముందే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. అంతేకాకుండా కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలంగాణ ప్రాంతం సుదీర్ఘకాలంగా పాలకుల అణచివేతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తోలెం నాగేశ్వరరావు, యూత్ జనరల్ సెక్రటరీ మిట్టపల్లి నితిన్, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగబండి వెంకటేశ్వర్లు, మండల యువజన అధ్యక్షుడు కునుసోత్ సాగర్, మండల మహిళా అధ్యక్షురాలు చందా వెంకటరత్నమ్మ, ఎర్ర సురేష్, జలగం కృష్ణ, మండల కార్యదర్శి షేక్ రఫీ, దంచనాల రాజేంద్రప్రసాద్, నరసింహారావు, లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంటనే పోస్టింగ్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రాంగోపాల్

మణుగూరు టౌన్: సింగరేణిలో కారుణ్య నియామకం కోసం ఎదురుచూస్తున్న వారికి వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ ఆదివారం అన్నారు. పీవీకాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎక్స్‌టర్నల్ క్లర్కులు, కెమిస్ట్రీలుగా ఇతర ఉద్యోగాలలో సెలక్ట్ చేసి ఒక రోజు డ్యూటీ చేసిన తర్వాత ఆర్డర్ వెనక్కి తీసుకున్న యాజమాన్యం ఇంతవరకు ఇవ్వకపోవడం విడ్డూరం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ జోక్యంతో సింగరేణిని నాశనం చేశారని, గెలిచిన కాంగ్రెస్ కూడా అదే బాటలో రాజకీయ జోక్యం చేసుకుంటే కార్మికులను ఒక్కతాటిపైకి తెచ్చి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



వేడుకకు హాజరైన డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు

మణుగూరు రూరల్: విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని డీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సంతోష్‌నగర్ ప్రాంతంలో సీటైప్ ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వారి ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల కార్నీడియం 2023-2024 వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎంఓ నాగేశ్వర్, ఎంఈఓ వీరస్వామి, జూనియర్ కళాశాలల ప్రతినిధులు కోటేశ్వర్, చైతన్య కృష్ణ, శేషగిరిరావు, ప్రమీల, నాగేంద్ర, పి.శంకర్, సింగరేణి వైద్యనిపుణులు శేషగిరిరావు, సింగరేణి హైస్కూల్ ప్రిన్సిపల్ స్వరూపరాణి, డాక్టర్ శశిధర్, పాఠశాల యాజమాన్యం ఖాదర్, ఎండి.యూసఫ్ షరీఫ్, యాకుబ్ షరీఫ్, సురేష్, ఖాన్, లెనిన్, నరేందర్, దండా రాధాకృష్ణ, నర్సారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలు ఒలుచుట ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలోని శ్రీ కృష్ణా ఆలయంలో రామయ్య కల్యాణానికి వినియోగించే గోటి తలంబ్రాలను భక్తులు ఆదివారం ఒలవటం ప్రారంభించారు. ధర్మజాగరణ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జెట్టి వెంకట్రాజు, వెంకటరత్నం, వెంకటరమణ, రాణి, సావిత్రి, రత్నవేణి, ఆదిలక్ష్మి, విపుల, శాంతమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చండ్రుగొండ: మండలంలోని మున్నూరుకాపు కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం మండలాధ్యక్షుడు రామిశెట్టి సైదయ్య అన్నారు. కాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం పిల్లలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు లంకా నర్సింహారావు, వెలగల మధు, రంగిశెట్టి రాము, అంచ కృష్ణ, కూసాల లక్ష్మిపతి, గంగారపు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైదయ్య

తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు



దమ్మపేట: యుగంధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, రింగ్ రోడ్ సెంటర్లో తుమ్మల యువసేన పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్లు సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, నాయకులు ఆలపాటి రాము, సుంకవల్లి వీరభద్రరావు, బండి భాస్కర్, జూపల్లి ప్రమోద్, తుమ్మా రాంబాబు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, దాసరి నాగేంద్రరావు, కాసాని మురళీ, చందువేణు గోపాల్, కొప్పుల శ్రీను, బూషి పాండు, ఫణి, నవీన్, జీవన్‌రావు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వనమా గాంధీ, నాయకులు పర్సావెంకటేశ్వర్లు, బోడపద్మ, ఇనుగంటి ప్రసాదు, భీంరెడ్డి వెంకటరెడ్డి, ఇనపనూరి జమలయ్య పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని తుమ్మల నివాసంలో యుగంధర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన నాయకులు, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల కేంద్రంలో ఆయన జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి, మిఠాయిలను పంచారు.

చండ్రుగొండ: మండలకేంద్రంలో కేక్ కట్ చేయగా నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, ఉప్పతల ఏడుకొండలు, దారం గోవిందరెడ్డి, ఎస్కే.మదార్ సాబ్, సురేష్, దాసరి రామారావు, మాజీ సర్పంచ్ రుక్మిణి పాల్గొన్నారు.

ములకలపల్లి : మండలకేంద్రంతోపాటు, జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు పేటేటి నర్సింహారావు, పర్వతనేని అమర్‌నాథ్, అడపా నాగేశ్వరరావు, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు కేక్‌కట్ చేశారు. ములకలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సున్నం సునిత, కారం సుధీర్, కోరంపల్లి చెన్నారావు, జహీర్, బుగ్గారపు సత్యనారాయణ, గాడి తిరుపతిరెడ్డి, పాపుర్తి పూర్ణచంద్‌రావు, రత్నభూషణం, పిడియాల బుజ్జి, పామర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలపై అసత్య ప్రచారాలు

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలకు తెరతీస్తుందని, ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించి అధికారమిచ్చారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని సుందరయ్యనగర్, భాస్కర్‌నగర్, గాంధీనగర్‌లలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరుగ్యారంటీల్లో ఇప్పటికే రెండు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు గుర్తించాలన్నారు. మరో రెండు గ్యారెంటీలను ఈ వారంలోనే అమలు చేసేందుకు ప్రభుత్వ పెద్దలు కసరత్తు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు దిగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తుండటంతో బీఆర్ఎస్ మాజీ మంత్రులు, రాష్ట్ర నాయకులు సమీక్షాల పేరుతో నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారన్నారు. అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు, తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటానన్నారు .అనంతరం మోరంపల్లిబంజరలో నూతనంగా నిర్మించిన పార్టీ దిమ్మెపై పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, తాళ్లూరి చక్రవర్తి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కైపు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీపీఎల్ టోర్నీ

బంజర ప్రీమియం లీగ్(బీపీఎల్) సీజన్-1 క్రికెట్ టోర్నీ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బహుమతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి టోర్నమెంట్‌ల నిర్వహణ వలన క్రీడాకారుల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. యువత క్రీడలతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా దివ్యశ్రీ, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఝున్నం వెంకటేశ్వర్లు, బాదం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాదెం వీరయ్య

దమ్మపేట: తెలంగాణలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని సరోజనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొదెం వీరయ్య మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి సమిష్టిగా పనిచేసి, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, మద్దిశెట్టి సామేలు, పాదిలి జ్యోతి, నాగబాబు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్

అశ్వాపురం: అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని యానంబైలు ఎఫ్ఆర్ఓ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలోని పాలవాగు గ్రామంలో ఆదివారం వైల్డ్‌లైఫ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజనుల నుంచి విల్లంబులు, ఉచ్చులకు వినియోగించే తీగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ... అడవులు నరకొద్దని, వన్యప్రాణులను వేటాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ హారిక, ఇన్‌చార్జ్ బీట్ ఆఫీసర్ జోగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1999 నుంచి 2002 సంవత్సర కాలంలో డిగ్రీ బీఏ గ్రూపు పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న డిగ్రీ కళాశాలను సందర్శించి రోజంతా సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, రామకృష్ణ, నాగ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆశలు పెంచి.. ఆవేదనలో ముంచి..!

- భారీ పెట్టుబడులతో మిర్చి సాగు.. తెగుళ్ల దాడితో పంట నష్టం
- దిక్కుతోచని స్థితిలో రైతులు



తాటిగూడెంలో వైరస్ సోకిన మిర్చి పొలం




కరకగూడెంలో ..

కరకగూడెం: ఆరుగాలం శ్రమించి స్వేదం చిందిస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. లక్షల్లో పెట్టుబడి పెట్టారు రాత్రీ పగలు కష్టపడ్డారు. పంట దండిగా పండితే అప్పుల బాధ నుంచి గట్టెక్కవచ్చనుకున్నారు. కానీ ప్రకృతి సహకరించక తుపాను, చీడపీడలు, వైరస్‌ల రూపంలో పంట చేతికందక ఆదిలోనే మిర్చి రైతుల ఆశలను ఆవిరవుతున్నాయి. మార్కెట్లో ధర ఎక్కువగా ఉందని సామర్థ్యానికి మించి అప్పు చేసి డ్రిప్ప విధానం పొలాల్లో పెట్టుకొని భారీగా పెట్టుబడి పెట్టినా నయాపైసా రాక పలువురు కన్నీటి పర్యంతం అవుతున్నారు. వాతావరణ మార్పులతో మిరప పంటలకు వైరస్ సోకుతుంది. ముఖ్యంగా గతేడాది తుఫాను కారణంగా మిర్చి మొక్కల్లో పెరుగుదల లోపించి పసుపు రంగులోకి మారడం, వైరస్ ఆశించిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. వైరస్ తీవ్రత తగ్గకపోవడంతో చేసేదేమీలేక మిరపను పలు చోట్ల దున్నేస్తున్నారు. కాసిన కొద్దోగొప్పో మిరప ఏరేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున నష్టపోయామని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

మిర్చి రైతులకు నష్టాలే దిగుబడి..!

మండలంలోని భట్టుపల్లి, కరకగూడెం, చిరుమళ్ల, గొడుగుబండ, పద్మాపురం, అనంతారం,తుమ్మలగూడెం, బుర్థారం, కలవనాగారం, రేగళ్ల తదితరు గ్రామాల్లో మిర్చిని విస్తారంగా సాగు చేశారు. మరికొద్ది రోజుల్లో కోతకు వచ్చి మంచి దిగుబడులు వస్తాయనుకున్న తరుణంలో పలు రకాల తెగుళ్ల కోలుకోలేని దెబ్బతీశాయి. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నిమందులు కొట్టినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదని ఎకరాకు 90వేల నుంచి లక్ష వరకు ఖర్చు చేశామని రైతులు లబోదిబోమంటున్నారు.


తెగుళ్లతో ఆందోళన



మిర్చి పంట సాగు ప్రారంభించినప్పటి నుండి చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. తీరా పంట కోత దశకు వచ్చేసరికి తెగుళ్ల దాడి పెరిగింది. దీంతో ఎక్కువ శాతం తాలు కాయలు వచ్చే అవకాశం ఉంది.ఈ పంటను అమ్మితే నష్టపోవాల్సిందే. తాలు కాయలకు కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. ఇప్పటికే చాలా పెట్టుబడి పెట్టాం.

– షేక్ జహూర్, రైతు కరకగూడెం

ప్రభుత్వం సాయం చేయాలి



మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. రూ 4 లక్షల వరకూ ఖర్చు చేశా. కోత కోయాలంటే భయమేస్తోంది. కూలి ధరలు బాగా పెరిగాయి. పంట అమ్మకం కంటే కూలి రేట్లు అధికం అనిపిస్తోంది. వైరస్ ఆశించడం వల్ల పంట మొత్తం పసుపు పచ్చ రంగులోకి మారి ఎండిపోయింది. మా లాంటి వారి గురించి ప్రభుత్వం ఆలోచించి సాయం చేయాలి.

– పి సారక్క, మహిళా రైతు తాటిగూడెం